## క్లుప్తంగా

### అంగరంగ వైభవంగా చెన్నకేశవ స్వామి రథోత్సవం



స్వామివారి రథోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చిన భక్తులు

**కర్నూలు(రూరల్):** మండల పరిధిలో గార్గేయపురం గ్రామంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి రథోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే స్వామివారి రథోత్సవాన్ని ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చిన భక్తులు స్వామి వారి రథోత్సవాన్ని తిలకించారు. ప్రతి ఏటా మృగశిర నక్షత్రం మఘుపౌర్ణమి రోజునస్వామివారి రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. భక్తులతో గార్గేయపురం నిండిపోయింది.

### దుకాణాల్లో చోరీ



చోరీకి గురైన దుకాణం

**కోడుమూరు రూరల్ :** కోడుమూరులోని కర్నూలు రోడ్డులో ఉన్న మూడు దుకాణాల్లో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి అనంతరం తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం యథావిధిగా దుకాణాలను తెరిచేందుకు వచ్చిన దుకాణదారులు తాళాలు పగులగొట్టి ఉండడాన్ని చూసి కోడుమూరు పోలీసులను ఆశ్రయించారు. శివ సాయి ట్రాక్టర్ స్పేర్స్ దుకాణంలో రూ.25వేలు, టీ దుకాణంలో రూ. వెయ్యికి పైగా విలువ సిగరెట్ పాకెట్లను దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### రహదారులపై ఆక్రమణలు తొలగించాలి

**కర్నూలు (టౌన్):** నగరంలో రహదారులపై ఆక్రమణలను తొలగించాలని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు ఆదేశించారు. ఆదివారం స్థానిక రైల్వేస్టేషన్ కూడలి, అశోక్ నగర్, నరసింహారెడ్డి నగర్, సంకల్‌బాగ్, కాలనీలలో కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రైల్వేస్టేషన్ వద్ద ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే విధంగా ఉన్న ఆక్రమణలను తొలగించాలన్నారు. అనధికారిక దుకాణాలు, రహదారుల వద్ద అక్రమ నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వాణిజ్య దుకాణాల వద్ద యజమానులు శుభ్రంగా ఉంచుకోవాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. చెత్త చెదారాన్ని మురుగు కాల్వల్లో వేయవద్దని సూచించారు. పారిశుద్ధ్య తనిఖీదారులు మునిస్వామి, షేక్షావలి పాల్గొన్నారు.

### ధ్యానంతో జీవనం మార్పు

**కర్నూలు కల్చరల్:** ధ్యానం, జ్ఞానంతో మనిషి జీవన విధానంలో మార్పు వస్తుందని సంత్ సదానంద గిరి మహారాజ అన్నారు. ఆదివారం రాఘవేంద్ర నగర్‌లోని పిరమిడ్ ధ్యాన కేంద్రానికి వచ్చిన రుద్ర ప్రయాగ పీఠాధిపతి సంత్ సదానంద గిరి మహరాజను ఘనంగా సన్మానించారు. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ.. సదానంద గిరి మహారాజ ధ్యానంతో జ్ఞానం పొంది జీవితాన్ని సుఖమయం చేసుకుంటూ 109 వసంతాలు పూర్తి చేసుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి, టీడీపీ నాయకులు గౌరు వెంకటరెడ్డి, పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి, జీఎస్టీ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య మాట్లాడారు. సినీ నిర్మాత సత్యారెడ్డి, పిరమిడ్ సభ్యులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో దత్త పౌర్ణమి

**కర్నూలు కల్చరల్:** ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ఆదివారం దత్త పౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, విశేష అర్చనలు జరిగాయి. పండితులు మామిళ్లపల్లి రాజేశ్ శర్మ ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం రాజశ్యామల అమ్మవారికి హోమం నిర్వహించారు. లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్య స్వామి సందేశమిచ్చారు.

### కోల్స్ చర్చిలో నేడు క్యాండిల్ లైటింగ్ సర్వీస్

**కర్నూలు (టౌన్):** స్థానిక పాతబస్టాండ్ వద్ద ఉన్న కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు సంఘంలో సోమవారం సాయంత్రం క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంఘ కాపరి రెవరెండ్ జీవన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీస్తు జన్మదినం పురస్కరించుకొని క్రిస్మస్ పాటలు, క్యాండిల్ లైటింగ్ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన ఎక్‌లేషియా బాప్టిస్టు ఫెలోషిప్ దైవ సందేశకులు రెవరెండ్ గ్లాడ్సన్ రామపోగు దేవుని సందేశం ఇస్తారని, క్రైస్తవులు పాల్గొని దేవుని ఆశీర్వాదాలు పొందాలన్నారు.

# ప్రీమియం చెల్లింపులు అంతంతే!

- ఆసక్తి చూపని రైతులు..ముగిసిన గడువు
- వరికి మాత్రం ఈ నెల 31 వరకు అవకాశం
- భారంగా మారిందంటున్న అన్నదాతలు
- రూ. వేలు చెల్లించలేమంటూ ప్రభుత్వ తీరుపై అసహనం

**కోడుమూరు రూరల్ :** వర్షాభావ పరిస్థితులు అన్నదాతను వెంటాడుతూనే ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ ఏ మాత్రం కలిసి రాకపోగా రబీ సీజన్ సైతం అనుకూలంగా లేదనే అసంతృప్తి వ్యక్తం అవుతుంది. అండగా నిలువాల్సిన ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ఏ మాత్రం పట్టించుకోలేదని రైతులతోపాటు అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల ముందు పెట్టుబడి సాయం ఏకంగా రూ. 20 వేలు చెల్లిస్తామంటూ నమ్మబలికిన కూటమి పెద్దలు ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ సీజన్ ప్రారంభమై రెండు నెలలవుతున్నా ఆ ఊసే ఎత్తని తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు రైతులు. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకానికి మంగళం పాడిన కూటమి సర్కార్ రబీలో సాగు చేసిన పంటల నష్టం బీమా వర్తించాలంటూ రైతులే స్వయంగా ప్రీమియం చెల్లించాలంటూ మరోభారం మోసింది. దీంతో అన్నదాత అసహనానికి గురువుతున్నారు. కోడుమూరు నియోజకవర్గంలో రబీ సీజన్‌లో దాదాపు 19,400 హెక్టార్లలో జొన్న, వేరుశనగ, ఉల్లి, టమోటా, వరి పంటలు సాగు చేశారు. ఈ పంటలకు సంబంధించి రైతులు ప్రీమియం చెల్లిస్తేనే పంటల బీమా వర్తిస్తుందని స్పష్టం చేసింది కూటమి సర్కార్. వరి మినహా మిగిలిన పంటలకు నేటితో ప్రీమియం చెల్లిపు గడువు ముగిసింది. అయితే ప్రీమియం చెల్లింపు అంతంతమాత్రమే జరిగింది. వరికి మాత్రం ఈ నెల 31 వరకు గడువు ఉంది. కర్నూలు జిల్లా వ్యాప్తంగా కేవలం 39,521 మంది రైతులు మాత్రమే చెల్లించినట్లు అధికారుల మాట. ప్రీమియ మొత్తం భారంగా ఉందంటున్నారు కొందరు అధికారులు సైతం.

**భారంగా ప్రీమియం మొత్తం**

గత ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు సాగు చేసిన పంటలు దెబ్బతినడంతో దిగుబడులు అంతంతమాత్రంగానే వచ్చాయి. రబీ సీజన్ ప్రారంభం నుంచి కూడా వర్షాలు సరిగా పడకపోవడంతో కోడుమూరు నియోజకవర్గంలో రబీ కింద 19,400 హెక్టార్లలో జొన్న, వేరుశనగ, ఉల్లి, టమోట, వరి పంటలను సాగు చేశారు. అయితే రబీలో సాగు చేసిన పంటలకు రైతులే ప్రీమియం చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. నాలుగెకరాలున్న రైతు కూడా ప్రీమియం చెల్లింపునకు దాదాపు రూ.2వేలు చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. ఇంత మొత్తం చెల్లించేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. నియోజకవర్గం కేంద్రం కోడుమూరుతో పాటు గూడూరు, సి.బెళగల్, కర్నూలు మండలాల్లో ఇప్పటికీ సగం మంది రైతులు కూడా రబీ పంటలకు ప్రీమియం చెల్లించలేకపోయారు. ప్రీమియం మొత్తం భారంగా మారిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కోడుమూరులో రబీ కింద సాగైన శనగ పంట



బీమా కట్టేందుకు మీ సేవా వద్ద వేచివున్న రైతులు

| పంట | ఎకరాకు చెల్లించాల్సింది |
|---|---|
| వరి | రూ.630 |
| శనగ | రూ.420 |
| వేరుశనగ | రూ.480 |
| జొన్న | రూ.297 |
| ఉల్లి | రూ.1350 |

**ఉచిత పంటల బీమా అమలు చేసిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం**

రైతుపై ప్రీమియం భారం పడకుండా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019 ఖరీఫ్ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసింది. పంట నమోదు ఆధారంగా సాగు విస్తీర్ణం అంతటికి రైతులు చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తూ వచ్చింది. దీంతో పంటల బీమా పథకం గురించి రైతులకు ఇబ్బందులు తప్పేవి. సాగు చేసిన ప్రతి ఎకరాకు బీమా పథకం వర్తించడంలో పంట నష్టం వాటిల్లినప్పుడు రైతులతో పాటు గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందేది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కోడుమూరు నియోజకవర్గంలో 57,164మంది రైతులకు రూ.385.85 కోట్ల వరకు పంట నష్టపరిహారం చెల్లించింది. ఇలాంటి పథకానికి కూటమి సర్కార్ మంగళం పాడడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు రైతులు. కూటమి సర్కార్ ఇప్పటికైనా ఉచిత పంటల బీమా అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

**రైతులే ప్రీమియం చెల్లించాల్సి ఉంది**

రబీ సీజన్‌కు సంబంధించి సాగు చేసిన పంటలకు రైతులే ప్రీమియం చెల్లించాలి. అప్పుడే పంటల బీమా వర్తిస్తుంది. జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం వరకు 39,521మంది రైతులు ప్రీమియం చెల్లించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ రోజుతో పంటలకు ప్రీమియం చెల్లించే గడువు ముగిసింది. వరి పంటకు మాత్రం ఈనెల 31వరకు అవకాశం ఉంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సాలురెడ్డి, ఏడీఏ, కర్నూలు

**ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నా..**



గతంలో జగనన్న ప్రభుత్వం పంటల బీమాకు సంబంధించిన ప్రీమియం చెల్లించి పంటలు నష్టపోతే రైతులకు పరిహారాన్ని చెల్లించి ఆదుకునేది. ప్రస్తుత ప్రభుత్వం రైతులే సాగు చేసిన పంటలకు ప్రీమియం చెల్లించాలనడం దారుణం. రైతులపై భారం మోపడం సమంజసం కాదు. ఖరీఫ్‌లో పంటల దిగుబడి సరిగా లేదు. రబీలో కూడ వర్షాభావ పరిస్థితుల మూలంగా నాలుగు ఎకరాల్లో సాగు చేసిన శనగ అంతంతమాత్రంగానే ఉంది. ప్రీమియం చెల్లింపునకు దాదాపు 2 వేల వరకు ఖర్చు వచ్చింది. చాలా ఇబ్బందులు పడుతూ ప్రీమియం చెల్లించాల్సి వచ్చింది. ప్రభుత్వం ఉచిత పంటల బీమా అమలు చేయాలి.

– నవీన్‌కుమార్‌రెడ్డి, కోడుమూరు

**డబ్బుల్లేక చెల్లించలేదు**



సొంత భూమితోపాటు, కౌలుకు తీసుకున్న పొలంతో కలిపి 14ఎకరాల్లో శనగ పంట సాగు చేశా. ప్రభుత్వ నిర్ణయించిన మొత్తం మేరకు తాను ప్రీమియం చెల్లించాలంటే రూ.7వేలు ఖర్చు అవుతుంది. ఖరీఫ్‌లో పంటల దిగుబడి పెద్దగా లేకపోవడంతో రబీ సాగుకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. డబ్బులు లేనందునే ప్రీమియం చెల్లించలేకపోతున్నా. రైతులకు అండగా నిలువాల్సిందిపోయే ప్రీమియం భారం మోపడం సమంజసం కాదు.

– రైతు శివ, వెంకటగిరి

## వైభవంగా విగ్రహాల ప్రతిష్టోత్సవాలు



శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయ విగ్రహాల ప్రతిష్టలో పాల్గొన్న కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి



శ్రీపక్కీరప్ప తాత చిత్రపటాన్ని ఊరేగిస్తున్న ప్రజలు

**కోడుమూరు రూరల్:** మండల కేంద్రం కోడుమూరులో పక్కీరప్పతాత ద్వితీయ ఆరాధన సందర్భంగా ఆదివారం నిర్వహించిన సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ విగ్రహాలు, కలశ ప్రతిష్టోత్సవాలు వైభవంగా జరిగాయి. ప్రతిష్టోత్సవాల్లో భాగంగా ద్వార తోరణం, ధ్వజకుంభ ఆరాధన, కలశారాధన, మూల మంత్ర హోమాదులు, యంత్ర స్థాపన, శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయ విగ్రహ, కలశ ప్రతిష్టోత్సవాలు, ప్రాణ ప్రతిష్టాహన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా.ఆదిమూలపు సతీష్, జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు. పక్కీరప్ప తాత చిత్ర పటాన్ని భక్త బృందం సభ్యులు ఘనంగా ఊరేగించారు. కార్యక్రమంలో భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవికుమార్‌రెడ్డి, మల్లారెడ్డి, గోపాల్‌రెడ్డి, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## సీఎస్ఐ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



భక్తిగీతాలు పాడుతున్న చిన్నారులు

**కల్లూరు:** కర్నూలు నగరంలోని శకుంతల కల్యాణ మండపం సమీపాన సీఎస్ఐ చర్చిలో ఆదివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి క్రీస్తు మార్గం అనుసరణీయమని పేర్కొన్నారు. అనంతరం బెంగుళూరుకు రెవ. జి.చంద్రశేఖర్ కరుణామయుడు యేసుక్రీస్తు మార్గాన్ని అనుసరించాలని సూచించారు. క్రీస్తు జననంపై చిన్నారులు ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. చిన్నారుల ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి. కార్యక్రమంలో కమిషనర్ రవీంద్రబాబు, పెద్దలు ఐజక్ ప్రసన్నకుమార్, జాన్సన్, విజయకుమార్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, స్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి బోరును ధ్వంసం చేసిన దుండగులు



సాగునీటి బోరు పైపులను తొలగించిన దృశ్యం

**కోడుమూరు రూరల్ :** మండలంలోని ఎర్రదొడ్డి గ్రామంలో శనివారం రాత్రి కొందరు గుర్తు తెలియని దుండగులు రైతు అయ్యన్నకు సంబంధించిన సాగునీటి బోరును ధ్వంసం చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఎర్రదొడ్డికి చెందిన రైతు అయ్యన్న శనివారం సాయంత్రం పొలములో మొక్కజొన్న పంటకు బోరు ద్వారా నీళ్లు కట్టాడు. తిరిగి ఆదివారం ఉదయం మిగిలిన పొలానికి కూడా నీళ్లు కట్టేందుకు వెళ్లాడు. అయితే బోరుకు సంబంధించిన పైపులైన్ నరికేసి ఉండటాన్ని గమనించాడు. పైపులతో పాటు, మోటారు బోరులోపలికి పడిపోయాయి. దీంతో లక్షన్నరకు పైగా తనకు నష్టం వాటిల్లడంతో పాటు, సాగు చేసిన మొక్కజొన్నకు నీళ్లు కట్టుకోలేని పరిస్థితి దాపురించిందని రైతు వాపోయాడు. రైతు అయ్యన్న ఫిర్యాదు మేరకు కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అభాగ్యులకు దుప్పట్ల పంపిణీ

**కర్నూలు(హాస్పిటల్):** నగరంలో వివిధ ప్రాంతాల్లో రహదారులపై నిద్రిస్తున్న అభాగ్యులకు అజ్వా వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు శనివారం అర్ధరాత్రి దుప్పట్లు పంపిణీ చేశారు. అభాగ్యులు చలిగాలులకు ఇబ్బంది పడుతూ అనారోగ్యానికి గురిగాకుండా దుప్పట్లు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. సొసైటీ ప్రెసిడెంట్ సాజిద్‌ఖాన్, సభ్యులు యాసిర్, సమీర్, వీరేష్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న గౌస్ దేశాయ్

**ఓర్వకల్లు:** ఏపీఐఐసీలో భూములు కోల్పోయిన రైతులకు తక్షణమే ఎకరాకు రూ.20 లక్షల పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఓర్వకల్లులో సీపీఎం మండల 3వ మహాసభను ఘనంగా నిర్వహించారు. మండల కమిటీ సభ్యులు శ్రీధర్, చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన మహాసభలకు ముఖ్య అతిథులుగా వారు హాజరయ్యారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓర్వకల్లు పరిశ్రమల హబ్‌లో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. పరిశ్రమల పేరుతో భూములు తీసుకున్న పేదలకు పరిహారం చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్, చాంద్‌బాషా, సుధాకర్, వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, రమాదేవి, నాగమ్మ, మాసూంబాషా, రామకృష్ణ, కృష్ణుడు, దస్తగిరి, ఎర్రమల, ప్రజా నాట్యమండలి కళాకారులు నాగరాజు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

### నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**సి.బెళగల్:** మండల కేంద్రం సి.బెళగల్ తహసీల్దార కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదకి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించే కార్యక్రమానికి అధికారులు కావాలని, గైర్హాజరు అయితే ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామన్నారు. మండల ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు.

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

**కోవెలకుంట్ల:** కోవెలకుంట్ల–నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. 108 అంబులెన్స్ సిబ్బంది సమాచారం మేరకు.. మండలంలోని కలుగొట్ల గ్రామానికి చెందిన రవి, రమేష్ సొంత పని నిమిత్తం బైక్‌పై కోవెలకుంట్ల వచ్చారు. కర్నూలు జిల్లా సి. బెళగల్ మండలం కొత్తకోటకు చెందిన సుదర్శన్ కలుగొట్లలోని కాశీనాయన ఆరాధనోత్సవాలకు వచ్చి తిరిగి బైక్‌పై వెళుతుండగా కోవెలకుంట్ల మండలంలోని జోళదరాశి సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురు గాయపడగా కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. రోడ్డు ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

**తమ్మరాజు పల్లె వద్ద ఇద్దరికి...**

**పాణ్యం:** మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం సమీపాన జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు హైవే పోలీసులు తెలిపారు. కర్నూలు నుంచి నంద్యాలకు వస్తున్న ఓ కారును వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలైయానట్లు తెలిపారు. హైవే పోలీసులు లారీని స్టేషన్‌కు తరలించారు.

### శత జయంతి ఉత్సవాలను విజయవంతం చేయండి

**కోడుమూరు రూరల్ :** సీపీఐ శత జయంతి సందర్భంగా ఈనెల 26 కోడుమూరులో జరిగే ఉత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం సీపీఐ వందేళ్ల పోరాటాల పుస్తకాలను కోడుమూరులో నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం, కార్మిక, కర్షక, ప్రజల హక్కుల కోసం సీపీఐ ఎనలేని పోరాటాలు చేసిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రాజు, నాయకులు శేషఫణి, మునిస్వామి, భాస్కర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

### కార్మికులకు యూనిఫాం పంపిణీ

**కర్నూలు(హాస్పిటల్):** నగరంలోని ప్రైవేటు ఆసుపత్రుల వ్యర్థాలను సేకరించి డంప్‌యార్డ్‌కు తరలించే నగర పాలక డ్రైవర్లు, లోడర్లు, ఇతర సిబ్బందికి కమిషనర్ రవీంద్రబాబు చేతుల మీదుగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు జతల యూనిఫాం పంపిణీ చేశారు. ఆదివారం స్థానిక పార్థసారథి నగర్‌లోని ఐఎంఏ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ.. ప్రైవేటు ఆసుపత్రులు స్వచ్ఛందంగా వాహనాలు, సిబ్బందిని ఏర్పాటు చేసి, వాటి ఖర్చును భరించడంతో పాటు సిబ్బంది అభ్యున్నతికి కృషి చేయడం అభినందనీయమన్నారు. ఐఎంఏ సభ్యులు మాట్లాడుతూ కమిషనర్‌తో పాటు ఆరోగ్యాధికారి డాక్టర్ కె.విశ్వేశ్వరరెడ్డి తమకు ఎలాంటి సమస్యలు లేకుండా, వ్యర్థాల తరలింపునకు పూర్తిగా సహకరిస్తున్నారని చెప్పారు. ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రామచంద్రనాయుడు, డాక్టర్ ఎస్వీ రామమోహన్‌రెడ్డి, డాక్టర్ శివశంకర్ రెడ్డి, డాక్టర్ బాలమద్దయ్య, డాక్టర్ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవికి ఘన నివాళి



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఈఓఆర్డీ ఈశ్వరయ్యసామి, అధికారులు



అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు



నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి



మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు



అమరజీవి పొట్టిశ్రీరాములుకు నివాళులర్పిస్తున్న సర్పంచ్ భాగ్యరత్న

**సి.బెళగల్:** అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి సూపరిండిండెంట్ శ్రీనివాసులు, ఉద్యోగులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కొండాపురం ప్రాథమిక పాఠశాలలో ఈఓఆర్డీ ఈశ్వరయ్య స్వామి, సచివాలయ ఉద్యోగులు అమరజీవికి నివాళులర్పించారు. బురాన్‌దొడ్డి, కొత్తకోట, గుండ్రేవుల, ఈర్లదిన్నె గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సైపుల్లాబేగ్, సచివాలయ ఉద్యోగులు ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**కల్లూరు:** కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర నేటి యువతరానికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

**ఓర్వకల్లు:** స్వాతంత్ర్య పోరాటంలో పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లాబాయి పటేల్ లాంటి మహనీయులు చేసిన సేవలు చిరస్మరణీయమని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లాబాయి పటేల్ వర్ధంతిని పురస్కరించుకుని వారి చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ వెంకటరామయ్య, పంచాయతీ కార్యదర్శులు, 108 సిబ్బంది పాల్గొన్నారు.

**కోడుమూరు రూరల్ :** అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ భాగ్యరత్న, పంచాయతీ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాళ వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు అందరికి ఆదర్శప్రాయుడని కొనియాడారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఆంధ్రయ్య, కృష్ణ, రాజు, వార్డు సభ్యుడు ప్రతాప్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## సంస్కారవంతులుగా తీర్చిదిద్దాలి

**కర్నూలు కల్చరల్:** పిల్లలను సంస్కారవంతులుగా తీర్చిదిద్దాలని కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు అన్నారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో భగరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ సంబంధాలు బాగుండాలన్నా, ఉత్తమ సమాజం నిర్మితం కావాలన్నా నైతికతను పెంపొందించాలన్నారు. ఇవన్నీ భగవద్గీత పఠనం, శ్రవణంతోనే సాధ్యమవుతాయన్నారు. అనంతరం హరే రామ.. హరే కృష్ణ నామ సంకీర్తన చేశారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటేశ్వరమ్మ

**కర్నూలు (రూరల్):** ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే బొగ్గు దస్తగిరి, ఎంపీపీ వెంకటేశ్వరమ్మ తెలిపారు. కర్నూలు మండల ప్రజాపరిషత్ సమావేశ భవనంలో ఆదివారం ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ రఘునాథ్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన పసుపల ఎంపీటీసీ మురళీ ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు సూచనలు పాటిస్తూ పల్లెల అభివృద్ధికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. పల్లెల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్ సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రొటోకాల్ పాటించడం లేదని కొందరు ప్రజా ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని జి.సింగావరం సర్పంచ్ నగేంద్ర కోరారు. ప్రధాన రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారని పడిదెంపాడు ఎంపీటీసీ సభ్యుడు పవన్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. గార్గేయపురం ఎస్సీ శ్మశాన వాటికకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని, పరిష్కార చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతిలత సభ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఈవోర్డీ అనురాధ, వైస్ ఎంపీపీ నేహిమ్య, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.